సాక్షి వైఎస్సార్ జిల్లా

గురువారం । 8 । జూన్ । 2023



వ్యవసాయ కనెక్షన్లకు ప్రాధాన్యత

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు తెలిపారు. -8లో..



అరటి ఉప ఉత్పత్తుల కేంద్రం పరిశీలన

పులివెందులలో అరటి ఉప ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ డిప్యూటీ సీఈఓ రమేష్ పరిశీలించారు. -8లో..



మినీ బస్సు బోల్తా

దువ్వూరు మండలం గుడిపాడు వద్ద మినీ బస్సు బోల్తా పడటంతో ఆరుగురికి గాయాలయ్యాయి. -8లో..

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఏర్పాటు చేసిన భవిత పాఠశాలల్లో రిసోర్సుపర్సన్లుగా పనిచేస్తున్న అభ్యర్థుల బదిలీలకు రాష్ట్ర ఉన్నత అధికారులు అనుమతి ఇచ్చారని సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్ రెడ్డి తెలిపారు. అభ్యర్థుల బదిలీలకు సంబంధించిన దరఖాస్తులను ఈనెల 8,9 తేదీలలో ఉమ్మడి కడప జిల్లా నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. 10వ తేదీన నూతన స్థానాలకు ఉత్తర్వులను అందజేస్తామని తెలిపారు. బదిలీలు అవసరమైన వారు తమ దరఖాస్తులను 8,9 తేదీలలో కడప సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

11న చదరంగం టోర్నమెంట్

కడప స్పోర్ట్స్: కడప నగరం మస్తాన్‌వలి వీధిలోని చదరంగం హాల్‌లో ఈనెల 11వ తేదీ ఉదయం 17వ అష్రఫ్–ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్ దర్బారీ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు పూర్తి వివరాలకు 8341255151 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

9న పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ



కడప అగ్రికల్చర్: కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 9వ తేదీన పుట్టగొడుగుల పెంపకంపై రైతులకు శిక్షణ కార్యాక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. సంబంధిత శిక్షణ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వయసు, చదువుతో సంబంధం లేకుండా హాజరుకావచ్చని తెలిపారు. 98488 09236 నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఆనందమానందమాయె..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం వెలగపూడి సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాల పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ గ్యారంటీడ్ పెన్షన్ బిల్లు 2023 పేరుతో కొత్త పెన్షన్ విధానం అమలుకు నిర్ణయం, సీపీఎస్ ఉద్యోగుల కోసం సీపీఎస్ స్థానంలో ఏపీ జీపీఎస్ బిల్లు తేవడం, ప్రధానంగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఆమోదం తెలపడం, 12వ పీఆర్సీ ఏర్పాటుకు అంగీకారం తెలపడంపై ఉద్యోగ సంఘాలు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నాయి.

- 12వ పీఆర్సీ ఏర్పాటు
- సీపీఎస్ స్థానంలో జీపీఎస్
- కొత్త డీఏ అమలు
- క్యాబినెట్ సమావేశంలో తీర్మానం
- సీఎం వైఎస్ జగన్ నిర్ణయంపై ఉద్యోగుల్లో సర్వత్రా హర్షం



కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. ఉద్యోగ వర్గాలు ఎంతోకాలం నుంచి అడుగుతున్న కోర్కెలను ఆమోదించింది. బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో 12వ పీఆర్సీ, ఏపీ గ్యారంటెడ్ పెన్షన్ స్కీమ్–2023, కొత్త డీఏ అమలు వంటి కీలక అంశాలపై నిర్ణయం తీసుకున్నారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల జిల్లాలోని పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మాట తప్పని ముఖ్యమంత్రిగా జగన్ తనను తాను మరోసారి రుజువు చేసుకున్నారంటూ కొనియాడుతున్నారు. గత ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను తీసుకొచ్చాయి. ఇందువల్ల 2004 సెప్టెంబరు 1 తర్వాత ఉద్యోగాల్లోకి వచ్చిన వారు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఉద్యోగ సంఘాలు చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. 2019 ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీపీఎస్ రద్దు చేస్తానని ఉద్యోగులకు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానానికి సమానంగా ఉండేలా ఆంధ్రప్రదేశ్ గ్యారంటెడ్ పెన్షన్ బిల్లు–2023 తీసుకొస్తూ క్యాబినెట్‌లో తీర్మానించారు. ఉద్యోగులు రిటైర్డ్ అయిన తర్వాత 50 శాతం పెన్షన్ తగ్గకుండా, డీఏ క్రమంగా పెరిగేలా ఈ బిల్లు రూపకల్పన చేయడం పట్ల ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 12వ పే రివిజన్ కమిషన్ నియమిస్తూ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని అంటున్నారు. సాధారణంగా జులై 1వ తేది తర్వాత పీఆర్సీని నియమించాలంటూ ఉద్యోగ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం, ఆ దిశగా ఆందోళనలు నిర్వహించడం, అనంతరం ప్రభుత్వం పీఆర్సీ ప్రకటన చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పుడు అందుకు పూర్తి భిన్నంగా గడువులోపే 12వ పీఆర్సీని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం సంతోషకరమని ఉద్యోగులు కొనియాడుతున్నారు. 2022 జనవరి 1 నుంచి ఉద్యోగులందరికీ అరియర్స్‌తో 2.73 శాతం డీఏ వర్తింపజేయడం, జిల్లా కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ 12 నుంచి 16 శాతం పెంచడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికి ఉన్న సానుకూల వైఖరికి నిదర్శనమని అంటున్నారు.

- తాను అధికారంలోకి వస్తే కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. 2014 జూన్ 2వ తేది నుంచి పనిచేస్తున్న 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరిస్తూ వైఎస్ జగన్ అధ్యక్షతన క్యాబినెట్ తీర్మానించడం పట్ల ఆ వర్గాల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.
- పోలీసు బెటాలియన్, వైద్యకళాశాలల్లో కొత్తగా 6840 పోస్టులకు ఆమోదం తెలుపడం పట్ల జిల్లాలోని నిరుద్యోగ యువత ఆనందం వ్యక్తం చేస్తోంది. కడప మానసిక వైద్య కళాశాలలో 116 పోస్టులకు ఆమోదం తెలుపడం అభినందనీయమని జిల్లా వాసులు అంటున్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సీఎం చొరవ

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



కడప కార్పొరేషన్: కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ చూపడం ప్రశంసనీయమని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఐటీఐ సమీపంలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులు ఎంతో కాలం నుంచి తమను పర్మినెంట్ చేయాలని కోరుతున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర వ్యాప్తంగా 10177 మందిని పర్మినెంట్ చేయాలని కేబినెట్‌లో తీర్మాణించడం అభినందనీయమన్నారు. ఉద్యోగుల కోసం కొత్త పీఆర్‌సీ ఏర్పాటు చేయడం, ఉద్యోగుల జీతాలు పెంచేందుకు హెచ్‌ఆర్‌ఏ 12 శాతం నుంచి 16 శాతానికి పెంచుతున్నారన్నారు. సీపీఎస్ కంటే మెరుగ్గా జీపీఎస్‌ను తీర్చిదిద్దారని, ఉద్యోగులకు ఇది మేలు చేస్తుందన్నారు.

డీఏ మంజూరుపై హర్షం



కేబినెట్ సమావేశంలో ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పలు అంశాలపై నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. గ్రూప్ ఆఫ్ మినిష్టర్స్ ఇంతకు ముందు ప్రకటించిన డీఏను ఇప్పుడు అమలు చేయడం అభినందనీయం. ఇంకొక డీఏ కూడా మంజూరు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. 2023 జులై 1 తర్వాత కొత్త పీఆర్సీ కోసం ఉద్యోగులు ఆందోళనలు నిర్వహించకముందే ప్రభుత్వం కొత్త పీఆర్సీని ప్రకటించడం ఆనందదాయకం. ఇందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నాము.

– బి.శ్రీనివాసులు, ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

చరిత్రాత్మక నిర్ణయం



రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా సమస్యలను ఎదుర్కొంటోంది. అయినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ చర్యలు తీసుకోవడం చారిత్రాత్మక నిర్ణయం. ఇందుకు సంబంధించి పలు అంశాలపై క్యాబినెట్ ఏకగ్రీవంగా తీర్మానించడం ప్రశంసనీయం.

– ఆదాల వెంగల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ యూనియన్

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ నిర్ణయం హర్షణీయం



రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తీసుకున్న నిర్ణయం హర్షణీయం. వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు అన్ని ప్రభుత్వ శాఖలలో ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయనుండటం సంతోషకరం. 2019 సంవత్సరంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.35 లక్షల ఉద్యోగాలకు అవకాశం కల్పించింది.

– వై.విశ్వనాథరెడ్డి, ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్

వెట్టి చాకిరీ నుంచి విముక్తి....



23 సంవత్సరాల వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించి కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసి కొత్త జీవితాన్ని ప్రసాదించిన జగనన్నకు ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు లెక్చరర్లు తరఫున కృతజ్ఞతాభివందనం. ఆ జన్మాంతం జగనన్నను గుర్తుంచుకుంటాం. బానిస వ్యవస్థను 2000 సంవత్సరంలో ప్రవేశపెట్టిన చంద్రబాబును అసహ్యించుకుంటున్నాం.

– డాక్టర్ రాజగోపాల్‌రెడ్డి, ఏపీ కాంట్రాక్టు డిగ్రీ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కాలేటి వాగు.. పనులు బాగు

- కరువు నేలపై జలకళ
- జీఎన్ఎస్ఎస్–హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ స్కీమ్ ద్వారా పనులు
- అంచనా వ్యయం రూ.5036 కోట్లు
- కాలేటి వాగు ప్రాజెక్టు నిర్మాణ పనులకు రూ. 300 కోట్లు
- ఈ స్కీం ద్వారా వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో 2,91,000 ఎకరాలకు సాగునీరు
- ఐదు లక్షల మంది ప్రజలకు తీరనున్న తాగునీటి అవసరాలు
- డిసెంబరు చివరి నాటికి పనులు పూర్తయ్యేందుకు చర్యలు



వేగంగా కొనసాగుతున్న కాలేటి వాగు బండ్ పనులు

కడప సిటీ: కరువు నేలపై జలకళ కనిపించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. కరువుతో అల్లాడుతున్న వైఎస్సార్ జిల్లాలోని చక్రాయపేట, అన్నమయ్య జిల్లాలోని లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలతోపాటు చిత్తూరు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో సాగునీటితోపాటు తాగునీటిని అందించనున్నారు. అందులో భాగంగా గాలేరు–నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్)–హంద్రీ నీవా–సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) లిఫ్ట్ స్కీము ద్వారా పలు నీటిపారుదల ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. ఈ స్కీమ్ ద్వారా పనులు నిర్వహించేందుకు జగనన్న ప్రభుత్వం రూ. 5036 కోట్లు అంచనా వ్యయంగా నిర్ణయించింది. పనులు ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయి.

- ప్రధానంగా చక్రాయపేట మండలంలోని తక్కోళ్లపల్లె సమీపంలో కాలేటి వాగు ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నారు. ఇక్కడి నుంచి నీటిని గ్రావిటీ ద్వారా వెలిగల్లు ప్రాజెక్టుకు పంపింగ్ చేస్తారు. అక్కడి నుంచి రెండు భాగాలుగా పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌వద్ద అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలోని జంగమదేవరపల్లె వద్దకు 800 క్యూసెక్కుల నీటిని తరలించనున్నారు. మొత్తం ఈ స్కీము ద్వారా 2,91,000 ఆయకట్టుకు నీరందడంతోపాటు ఐదు లక్షల మంది ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రధాన ఉద్దేశ్యంతో నిర్మాణం చేపట్టారు. అంతేకాకుండా చక్రాయపేట, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లోని 130 చెరువులకు నీరందించి భూగర్భ జలాలు పెంపొందించే దిశగా ప్రణాళికలు రూపొందించడంతో పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

రూ. 300 కోట్లతో కాలేటి వాగు పనులు

చక్రాయపేట మండలంలోని కాలేటి వాగు రిజర్వాయర్ నిర్మాణ పనులకు రూ. 300 కోట్ల నిధులు కేటాయించారు. జీఎన్ఎస్ఎస్ కెనాల్ నుంచి వేంపల్లె మండలం పాములూరు గ్రామంలోని 56వ కిలోమీటరు వద్ద నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఈ ప్రాజెక్టుకు నీటిని తరలిస్తారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే చక్రాయపేట, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లోని 130 చెరువులను నింపి భూగర్భ జలాలు పెంపొందించే దిశగా ప్రణాళిక సిద్ధం చేశారు. తద్వారా భూగర్భ జలాలు పెంపొందేందుకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా 2500 ఎకరాల ఆయకట్టుకు కూడా సాగునీరు అందనుంది.



జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ పనుల్లో భాగంగా కొనసాగుతున్న టన్నెల్ పనులు

- ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఆరు గేట్ల నిర్మాణం, రూ. 1085 కోట్లతో పైపులైన్ పనులు చేయనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు పనులు స్పిల్‌వే గ్రావెటీ కెనాల్, పంపుహౌస్ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. పది పంప్‌హౌస్‌ల నిర్మాణానికిగాను రూ. 1030 కోట్లు ఖర్చు చేయనున్నారు. కాలేటి వాగుకు సంబంధించి 90 శాతం బండ్ స్పిల్‌వే జరిగాయి. గేట్ల పనులు జరుగుతున్నాయి. కెనాల్ పనులు 60 శాతం మేర జరిగాయి.
- కాలేటి వాగు ప్రాజెక్టుకు 1.2 టీఎంసీల నీటిని తరలించడంతోపాటు కల్లూరుపల్లె ట్యాంకు కూడా 0.3 టీఎంసీల నీటిని పంపింగ్ చేస్తారు. అక్కడి నుంచి చెరువులకు నీటిని నింపేందుకు చర్యలు చేపడతారు.

జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ స్కీమ్ పనులు

కాలేటి వాగుకు జీఎన్ఎస్ఎస్ నుంచి గ్రావిటీ ద్వారా నీటిని నింపి అక్కడి నుంచి 1550 క్యూసెక్కుల నీటిని వెలిగల్లు ప్రాజెక్టుకు గ్రావిటీ ద్వా రానే తరలిస్తారు. మొత్తం ఈ స్కీముకు సంబంధించి 160 కిలోమీటర్ల మేర పైపు లైన్‌కు రూ. 2626 కోట్లు ఖర్చు చేయనున్నారు. అందులో భాగంగా 4.8 కిలోమీటర్ల మేర టన్నెల్ పనులు కూడా చేపడుతున్నారు. ఇందుకుగాను రూ. 206 కోట్లు ఖర్చు చేయనున్నారు. భూ సేకరణకు సంబంధించి 1355ఎకరాలు అవసరం కాగా, రూ. 82 కోట్లు పరిహారం కింద నిర్ణయించారు. ఇంకా భూ సేకరణ కొంత చేయాల్సి ఉంది. కాలేటి వాగు నుంచి 1550 క్యూసెక్కుల నీటిని వెలిగల్లు ప్రాజెక్టుకు తరలించనున్నారు. వెలిగల్లు నుంచి రెండు భాగాలుగా విడిపోయి హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్‌కు 750 క్యూసెక్కులు, పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌కు 800 క్యూసెక్కులు నీటిని తరలిస్తారు. ఈ స్కీమ్ ద్వారా పనులు పూర్తయితే అన్నమయ్య జిల్లాలో లక్ష ఎకరాలు, వైఎస్సార్ జిల్లాలో 39 వేల ఎకరాలు, చిత్తూరు జిల్లాలో లక్షా 52 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అంతేకాకుండా ఐదు లక్షల మంది ప్రజలకు తా గునీటి అవసరాలు కూడా తీరనున్నాయి. డిసెంబరు చివరి నాటికి పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపడుతోంది.



జీఎన్ఎస్ఎస్-హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ స్కీమ్‌లో భాగంగా కొనసాగుతున్న పైపులైన్ పనులు

పనులు వేగవంతానికి చర్యలు



జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ స్కీములో భాగంగా కాలేటి వాగు రిజర్వాయర్‌తోపాటు వెలిగల్లుకు నీటిని అందించేందుకు పైపులైన్ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని పనులను డిసెంబరు నాటికి పూర్తి చేసేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటున్నాం. వెలిగల్లు నుంచి రెండు భాగాలుగా విడిపోయి హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్‌కు 750 క్యూసెక్కులు తరలించడం జరుగుతుంది.

– మల్లికార్జునరెడ్డి, ఎస్ఈ, జీఎన్ఎస్ఎస్, కడప

పనుల పురోగతిపై సమీక్షలు



ఈ పనుల విషయమై ప్రత్యేక దృష్టి సారించాము. అందులో భాగంగా ప్రతివారం ఈ పనులకు సంబంధించి సమీక్షలు నిర్వహిస్తున్నాము. పనుల పురోగతిపై పరిశీలిస్తున్నాము. భూ సేకరణ వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాము. ఈ పనులు పూర్తయితే వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లోని 2,91,000 వేల ఎకరాలకు సాగునీరు అందడంతోపాటు ఐదు లక్షల మంది ప్రజలకు తాగునీటి అవసరాలు తీరనున్నాయి.

– వి.విజయరామరాజు, జిల్లాకలెక్టర్, వైఎస్సార్ జిల్లా

బాధ్యతల స్వీకరణ



కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా గిడుగు వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన 1988లో డిపో మేనేజర్ ట్రైనింగ్‌లో చేరారు. ఆ తర్వాత కల్యాణదుర్గం, మార్కాపురం, వెంకటగిరి, తెనాలి, పిడుగురాళ్లలో డిపో మేనేజర్‌గా పనిచేశారు. విజయనగరం, కడప, అనంతపురం, ఢిల్లీలలో డివిజనల్ మేనేజర్ క్యాడర్లలో, వరంగల్‌లో ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సేవలు అందించారు. 2010లో విజయనగరం, 2013లో అనంతపురం, 2015లో కర్నూలు ఆర్ఎంలుగా, 2018లో చీఫ్ కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్‌గా, 2019లో నెల్లూరు ఈడీగా, ఆ తర్వాత విజయవాడ జోన్ ఈడీగా పనిచేస్తూ కడపకు బదిలీపై వచ్చారు.

కళాశాల అభివృద్ధికి కృషి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులోని వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ చింతా సుధాకర్ తెలిపారు. వైవీయూ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన తొలిమారు ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలను బుధవారం సందర్శించారు. ఆయన కళాశాలలోని ప్రయోగశాలను, తరగతి గదులను, లైబ్రరీని పరిశీలించారు. ఈ సందర్భంగా వైస్‌ఛాన్సలర్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామన్నారు. కళాశాలలోని గ్రంథాలయం అభివృద్ధికి తాను వచ్చిన తర్వాత రూ.5లక్షలు మంజూరు చేశామని తెలిపారు. రూ.65 కోట్లతో నిర్మిస్తున్న భవనాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వైస్ చాన్సలర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నాగరాజు, అధ్యాపకులు సన్మానించారు.

బాలిక అదృశ్యం : కేసు నమోదు

ముద్దనూరు : మండలంలోని పెనికలపాడు గ్రామానికి చెందిన 17 సంవత్సరాల బాలిక అదృశ్యమైనట్లు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు.సీఐ నరేష్ బాబు కథనం మేరకు బాలిక తల్లితండ్రులు కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 6వతేదీన వారు కూలిపనికి పోయి సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా కుమార్తె కనిపించలేదు. కుమారుడిని అడగగా చిలంకూరులో ఉండే అవ్వ ఇంటికి వెళ్లినట్లు తెలిపాడు. బుధవారం కూడా బాలిక ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పుష్పగిరి హుండీ ఆదాయం లెక్కింపు

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో కొండపై గల శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో శాశ్వత హుండీల ద్వారా స్వామి వార్లకు రూ 4, 50, 515 ల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. భక్తులు స్వామి వార్లకు కానుకల రూపంలో హుండీల ద్వారా సమర్పించిన ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో , ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ జనార్దన్, ఆలయ అర్చకులు సుమంత్ దీక్షితులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుమారుడిని రక్షించబోయి తండ్రి మృతి


మూడే గోపాల్‌నాయక్ మృతదేహం

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : విద్యుత్ తీగలకు తగులుకున్న కుమారుడిని రక్షించబోయి తండ్రి మృతి చెందిన సంఘటన మైలవరం మండలంలో చోటు చేసుకొంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొన అనంతపురం గ్రామానికి చెందిన మూడే గోపాల్ నాయక్ ఇంటిపై దుస్తులు ఆరేసేందుకు తంతెను ఏర్పాటుచేశారు. 12 సంవత్సరాల వయస్సు కలిగిన కుమారుడు మూడే రమేష్ నాయక్ దుస్తులు తీసుకొచ్చేందుకు ఇంటిపైకి వెళ్లాడు. అయితే పక్కనున్న విద్యుత్ బల్బు కోసం ఏర్పాటుచేసిన తీగలు ప్రమాదవశాత్తు రమేష్‌నాయక్ కు తగిలాయి. గమనించిన మూడే గోపాల్ నాయక్ కుమారుడిని తప్పించాడు. అయితే తీగలు మూడే గోపాల్ నాయక్ తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బంధువులు జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇతనికి భార్య దేవి. ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి ఆసుపత్రికి వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

తండ్రీ తనయుల చరిత్ర
ప్రజలకు బాగా తెలుసు

- ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చిత్రంలో మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబు..ఆయన తనయుడు లోకేష్ చరిత్ర రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసని మైదుకూరు శాసన సభ్యులు ఎస్. రఘురామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మేయర్ సురేష్ బాబుతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడుతూ కనీసం సర్పంచ్ కూడా కాలేని లోకేష్ ఏ కేడర్‌తో పాదయాత్ర చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. రాష్ట్రానికి స్పెషల్ స్టేటస్ రాకపోయినా వైఎస్ భాస్కర్‌రెడ్డికి స్పెషల్ హోదా వచ్చిందని విమర్శించడం దారుణమన్నారు. వైఎస్ భాస్కర్‌రెడ్డి కుటుంబ నేపథ్యం, వయసురీత్యా అది సీబీఐ కోర్టు ఇచ్చిందే తప్ప మరొకరు ఇచ్చింది కాదన్నారు. ప్రత్యేక ప్యాకేజీ కోసం హోదాను తాకట్టు పెట్టిందెవరో లోకేష్‌కు తెలియదా.. అని ప్రశ్నించారు. మెరిట్స్ ప్రకారమే వైఎస్ అవినాష్‌రెడ్డికి హైకోర్టులో ముందస్తు బెయిల్ వచ్చిందన్నారు. అవినాష్‌రెడ్డి సాక్షులను ప్రభావితం చేస్తున్నారని సీబీఐ కూడా కౌంటర్ దాఖలు చేయలేదన్నారు. ఐదేళ్ల టీడీపీ పాలనలో ప్రజలకు సెంటు స్థలం ఇవ్వలేదన్నారు. చింతకుంటలో సర్వే నంబర్ 1396లో 80 ఎకరాలు కబ్జా చేశారని లోకేష్ చెప్పడం దారుణమన్నారు. ఆ సర్వే నంబర్‌లో కేవలం 5.40 ఎకరాలు మాత్రమే ఉందని తెలిపారు. నంద్యాలంపేటలో 4.80 ఎకరాల విలువైన భూమి పుట్టా నాగలక్ష్మి పేరు మీద ఉందని గుర్తు చేశారు. పుట్టా బావమరుదులు, బంధువులు కబ్జాలు చేశారని ఆరోపించారు. మాజీ సైనికులకు, నిరుపేదలకు ఇవ్వాల్సిన టీకేటీ భూములను టీడీపీ హయాంలో వందల ఎకరాలు ఆక్రమించుకున్నారన్నారు. టీడీపీ హయాంలో మైదుకూరులో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని నిలదీశారు.

ఈవెంట్‌లాగా నడుస్తున్న యువగళం : మేయర్

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ యువగళం పేరుతో చేస్తున్న పాదయాత్ర ఈవెంట్‌లాగా నడుస్తోందని కడప మేయర్ కె. సురేష్ బాబు ఎద్దేవా చేశారు. జిల్లాలో లోకేష్ 8 రోజులు పాదయాత్ర చేసినప్పటికీ అనుకున్న స్పందన రాలేదన్నారు. కడపలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో 5 కిలోమీటర్ల పాదయాత్ర ఒకటిన్నర గంటలో పూర్తయిందన్నారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని లోకేష్ ముఖ్యమంత్రి జగన్‌పై విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. చంద్రబాబు, లోకేష్ గురించి రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసని, వారిని జనం ఎప్పటికీ నమ్మరని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ ఎస్. యానాదయ్య, ఎన్. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మానసిక వైద్యశాలకు 116 పోస్టులు మంజూరు

కడప అర్బన్ : రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చొరవను తీసుకుని కడపలోని 100 పడకల మానసిక వైద్యశాల నిర్మాణం ఇప్పటికే పూర్తయిందని, అందులో వైద్యులు, ఇతర పరిపాలన సిబ్బంది విధులను నిర్వహించేందుకు 116 పోస్టులను మంజూరు చేశారు. వాటి భర్తీకి కేబినెట్ ఆమోదం తెలియజేసింది. ఈ సందర్భంగా రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, మానసిక వైద్య విభాగం సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరాముడు, వైద్యులు, వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే 100 పడకల సామర్థ్యంతో రూ.40- 45 కోట్ల వ్యయంతో మానసిక వైద్యశాల నిర్మాణంను పూర్తి చేశారు. త్వరలో హాస్పిటల్ ప్రారంభానికి సిద్ధమవుతోందన్నారు. మానసిక వైద్యశాల నిర్మాణానికి, అందుబాటులోకి రావడానికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్‌బి అంజాద్‌బాషాకు, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డికి, జిల్లాలోని ఎమ్మెల్యేలకు, జిల్లా అధికారులకు డాక్టర్ వెంకటరాముడు, వైద్య సిబ్బంది కృతజ్ఞతలను తెలియజేశారు.

వ్యవసాయ కనెక్షన్లకు ప్రాధాన్యత

- ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు


మాట్లాడుతున్న సీఎండీ సంతోష్‌రావు

ప్రొద్దుటూరు క్రైం : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు తెలిపారు. రైతులు డిపాజిట్ కట్టిన వెంటనే నెల రోజుల్లోగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని చెప్పారు. స్థానిక పోసినా కాంపౌడ్‌లోని ఫంక్షన్ హాల్‌లో ప్రొద్దుటూరు డివిజన్‌లోని కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజవర్గాలకు సంబంధించి వివిధ అంశాలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన డీపీటీ అకౌంట్స్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పదే పదే జరుగుతున్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్‌ను తగ్గించాలని చెప్పారు. 33 కేవీ, 11 కేవీ ఫీడర్లలో అంతరాయాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విద్యుత్ బకాయిలను వసూలు చేయుటకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్ ఫీడర్లలో నష్టాలు తగ్గించాలన్నారు. విద్యుత్ చౌర్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారులు వారికి కేటాయించిన హెడ్ క్వార్టర్స్‌లో నివాసముంటూ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలని సీఎండీ సూచించారు. కార్యక్రమంలో ఓఎస్డీ శ్రీనివాసులు, ప్రొద్దుటూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసులరెడ్డి, డీఈలు, ఏఈలు, సీనియర్ అకౌంట్ ఆఫీసర్, సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిల వసూలుపై దృష్టి సారించాలి

మైదుకూరు : మైదుకూరు డివిజన్ పరిధిలో విద్యుత్ బకాయిలు పేరకపోయాయని, వాటి వసూలుపై దృష్టి సారించాలని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్ తెలిపారు. బుధవారం మైదుకూరులోని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో మైదుకూరు, ఖాజీపేట, చాపాడు, దువ్వూరు, పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు, బద్వేలు, గోపవరం, బ్రహ్మంగారిమఠం, అట్లూరు మండలాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అధికారులు కేటాయించిన ప్రదేశాల్లో ఉంటూ పనిచేస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయన్నారు. ప్రతి ఉద్యోగి కేటాయించిన ప్రాంతాల్లో ఉండాలని ఆదేశించారు. ఇకపై తరచూ పరిశీలనకు వస్తానని, పనులు చేయని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్లు ధర్మజ్ఞాని, గురవయ్య, ఓఎస్డీ ఎస్.శ్రీనివాసులు, ఎస్ఈ ఎస్.రమణ, అకౌంట్ ఆఫీసర్ మధు, మైదుకూరు డివిజన్ ఈఈ జీవీ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 50 కుటుంబాలు చేరిక


తిమ్మాపురంలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ముద్దనూరు : మండలంలోని తిమ్మాపురం గ్రామంలో 50 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. గ్రామ నాయకుడు మునిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తిమ్మాపురం సర్పంచ్ రాజ్యలక్ష్మి, భద్రారెడ్డి, రాజుల అశ్వర్థరెడ్డి, ఈశ్వరరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శివశంకర్ రెడ్డి, గంగాధర్ పార్టీలో చేరినట్లు మునిరెడ్డి తెలిపారు.

మినీ బస్సు బోల్తా : ఆరుగురికి గాయాలు

దువ్వూరు : మండల పరిధిలోని గుడిపాడు గ్రామం వద్ద బుధవారం జాతీయ రహదారిపై మినీ బస్సు బోల్తా పడటంతో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. తెలంగాణ రాష్ట్రానికి చెందిన మినీ బస్సులో 20 మంది హైదరాబాద్ నుంచి కాణిపాకం వెళుతుంగా గుడిపాడు గ్రామ సమీపానికి రాగానే అదుపు తప్పి జాతీయ రహదారి పక్కనున్న పొలాల్లో బోల్తా పడింది. సమీపంలోని గోడౌన్‌లో పనిచేస్తున్న కూలీలు గమనించి బస్సులోని ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కాశినాయన : కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల తహసీల్దారు కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్, బద్వేలు ఆర్డీఓ ఆకులవెంకటరమణలు ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

హౌస్ మెయిడ్ మహిళలకు అగ్రిమెంట్ తప్పనిసరి

కడప కార్పొరేషన్ : కువైట్‌కు కొత్తగా వచ్చే హౌస్ మెయిడ్ మహిళలకు భారత రాయబార కార్యాలయ అగ్రిమెంట్ తప్పనిసరి అని ఏపీఎన్‌ఆర్‌టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్ పేర్కొన్నారు. కువైట్‌లోని షాహిల్ ప్రాంతంలో కువైట్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉన్న హౌస్ మెయిడ్ ఆఫీసుల సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో పీసీపీ కొరకు దరఖాస్తు చేసుకుంటే ఎంబసీ అగ్రిమెంట్ తప్పనిసరి అని లేకపోతే పీసీపీ వచ్చేది కాదన్నారు. దానివల్ల ఒక నెల సమయం వృథా అయ్యేదన్నారు. హౌస్ మెయిడ్ వచ్చేదానికి ఆలస్యమైతే వీసా ఇచ్చిన కువైటీలు కొట్లాడేవారన్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చి అగ్రిమెంట్ పేపర్, వీసా లేకపోయినా కేవలం పాస్‌పోర్టు ఉంటే పీసీపీకి దరఖాస్తు చేసుకునేలా ఏపీఎన్‌ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్ కృషి చేశారన్నారు. రాష్ట్రం నుంచి కువైట్‌కు తీసుకొచ్చే మహిళల వద్ద వీసా కొరకుగానీ, టికెట్ కుగానీ దారి ఖర్చులతో సహా తామే భరిస్తున్నామన్నారు. నయాపైసా వారి వద్దనుంచి తీసుకోమని.. ప్రతి ఒక్కరికీ ఎంబసీ అగ్రిమెంట్ తీసుకుంటామని తెలిపారు. కువైట్‌కు రావాలనుకొని వీసాకు రూ.35,400 చెల్లించి, తర్వాత కొన్ని కారణాల వల్ల మెడికల్ ఫెయిల్ అయి రాలేని మహిళల డబ్బులు తిరిగి ఇచ్చేలా ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ఎం. బాలిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ఏపీఎన్‌ఆర్‌టీఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్, సీఈఓ హేమలత సలహాలు, సూచనల మేరకు ప్రవాసాంధ్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కువైట్ కో కన్వీనర్ గోవిందు నాగరాజు, సలహాదారు ఎన్. చంద్రశేఖర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు షేక్ రహమతుల్లా, లక్ష్మీప్రసాద్, ఎన్వీ సుబ్బారెడ్డి, హౌస్ మెయిడ్ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ అంటే తెలుగు దొంగల పార్టీ

- పద్నాలుగేళ్లు చంద్రబాబు సీఎంగా ఉండటం ప్రజల దురదృష్టం
- రూ.150కోట్లు ఖర్చు చేసినా లోకేష్ మంగళగిరిలో గెలవలేదు
- ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : టీడీపీ అంటే తెలుగు దొంగల పార్టీగా తయారైందని కమలాపురం శాసన సభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా ఉండే మంచి అవకాశాన్ని దేవుడు ఇచ్చినప్పటికీ ఆయన దాన్ని సద్వినియోగం చేసుకోలేదన్నారు. నలభై ఏళ్ల అనుభవం అంటూ హైటెక్ సిటీ కట్టా, సెల్‌ఫోన్ తెచ్చా అంటూ..సొల్లు కబుర్లు చెప్పడమే ఆయనకు తెలుసని ఎద్దేవా చేశారు.ఒక్క మంచి పథకాన్ని రూపకల్పన చేసిన చరిత్ర బాబుకు లేదన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండి ప్రజలకు మేలు చేయకుండా రాష్ట్ర బడ్జెట్‌ను దోచుకుతిన్నారని ఆరోపించారు. దేశంలోనే ఆయనంత అవినీతి చక్రవర్తి లేరని ఎద్దేవా చేశారు.మంగళగిరి అని సరిగ్గా పలకడం కూడా రాని లోకేష్‌ను అక్కడ పోటీ చేయిస్తే ప్రజలు చిత్తుగా ఓడించారన్నారు. అయినా మంత్రిని చేసి ఐటీ శాఖ అప్పగిస్తే ఫైబర్ నెట్, ఇసుక, దేవాలయాల టాయ్‌లెట్ల క్లీనింగ్‌లో హోల్‌సేల్‌గా కమీషన్లు దండుకొన్నారని ఆరోపించారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాకే కుప్పం రెవెన్యూ డివిజన్, నగర పంచాయితీ అయిందని గుర్తు చేశారు. చంద్రబాబు సొంతూరు చంద్రగిరి అయినప్పటికీ కుప్పానికి పారిపోయి వచ్చారని, లోకేష్‌ను మంగళగిరిలో పోటీ చేయించి కుటుంబమంతా హైదరాబాద్‌లో ఉంటున్నారని..ఇదెక్కడి విడ్డూరమని ఎద్దేవా చేశారు. రూ. 150 కోట్లు ఖర్చు చేసినా మంగళగిరిలో లోకేష్ గెలవలేదన్నారు.అమరావతిలో 38వేల ఎకరాల భూములను తమ అనుయాయులకు కట్టబెట్టారని, అక్కడి ప్రజలకు మేలు జరిగి ఉంటే లోకేష్‌ను ఎందుకు గెలిపించలేదని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌ను ప్యాలెస్ పిల్లి అని విమర్శించడం సరికాదన్నారు. వైఎస్ జగన్ కదిలితే సింహమని, 51 శాతం ఓట్లతో 151 సీట్లు సాధించిన ఘనత ఆయన సొంతమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏ పార్టీ ఇన్ని ఓట్లు సాధించలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో 85 శాతం ఓట్లతో మళ్లీ వైఎస్సార్‌సీపీయే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. లోకేష్ జిల్లాలో ఎనిమిది రోజులు పాదయాత్ర చేసినా ఏ నియోజకవర్గానికి ఎవరు ఇన్‌చార్జో ప్రకటించలేకపోయారని ఎద్దేవా చేశారు. తనను భూ బకాసురుడని లోకేష్ విమర్శించడం హాస్యాస్పదమన్నారు. దేవరాజుపల్లె, దాదిరెడ్డిపల్లె, పైడీకాల్వ, సముద్రంపల్లె గ్రామాల్లో 400లకు పైగా డీకేటీ భూములను పుత్తా నరసింహారెడ్డి కబ్జా చేసి తన ఆధీనంలో ఉంచుకున్నారని ఆరోపించారు. కడపలో ఎమ్మెల్యే రంగారెడ్డి భూమిని, న్యాయవాదికి చెందిన సాయిబాబా థియేటర్‌ను కబ్జా చేశారని ఆరోపించారు. చెరువుకిందపల్లె నుంచి ఇసుకను బెంగళూరుకు తరలించి వేలకోట్లు దండుకున్నారన్నారన్నారు. నీరు-చెట్టు పథకంలో కూడా అన్ని పనులు అతనే చేసుకున్నాడే తప్పా కార్యకర్తలకు ఇచ్చింది శూన్యమని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, రఘునాథరెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వీరారెడ్డి, సుబ్బారెడ్డి, క్రిష్ణ పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రలో
గుడ్లు విసిరిన ఇద్దరు వ్యక్తుల అరెస్ట్


అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : నారాలోకేష్ యువగళం పాదయాత్రలో కోడిగుడ్లు విసిరిన ఇద్దరిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ బుధవారం రాత్రి మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. పెన్నానగర్‌కు చెందిన ఇంటి బాబు, శ్రీకాంత్‌లు స్నేహితులు. ఇద్దరు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రొద్దుటూరులో ఈ నెల 1న సాయంత్రం చౌటపల్లె విడిది కేంద్రం నుంచి రెండో రోజు నారాలోకేష్ పాదయాత్ర ప్రారంభమైంది. ప్రారంభం నుంచి పాదయాత్ర వెంట నడిచిన బాబు బొల్లవరంలోకి రాగానే లోకేష్‌తో సెల్ఫీ తీసుకునేందుకు వెళ్లగా వలంటీర్లు అతన్ని తోసేశారు. చేసేదేమి లేక అతను నిరాశతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అలాగే వన్‌టౌన్ సమీపంలోని ఉమేష్‌చంద్ర సర్కిల్ వద్దకు లోకేష్ వచ్చిన వెంటనే సెల్ఫీ తీసుకునేందుకు శ్రీకాంత్ భార్యా పిల్లలతో కలిసి వెళ్లాడు. అయితే వారిని కూడా రోప్ పార్టీ వలంటీర్లు పక్కకు నెట్టేశారు. ఈ క్రమంలో కొద్ది సేపటి తర్వాత శ్రీకాంత్ బాబుకు ఫోన్ చేయడంతో ఇద్దరు కలిసి ఎర్రగుంట్ల రోడ్డులోని నంగనూరుపల్లె క్రాస్ వద్దకు వెళ్లారు. అక్కడ ఇద్దరు సెల్‌ఫోన్లో లైవ్‌లో లోకేష్ పాదయాత్రను వీక్షిస్తూ మద్యం సేవించారు. నారాలోకేష్ తమకు సెల్ఫీ తీసుకోవడానికి అవకాశం ఇవ్వలేదని ఇద్దరూ తమ ఆవేదనను ఒకరికొకరు పంచుకున్నారు. అక్కడి నుంచి శ్రీకాంత్, బాబులు రిలయెన్స్ పెట్రోల్ బంకు వద్దకు వెళ్లారు. సమీపంలోని దుకాణంలో శ్రీకాంత్ మూడు గుడ్లు, బాబు రెండు గుడ్లను కొనుగోలు చేశారు. కొంత సేపటి తర్వాత లోకేష్ పాదయాత్ర అక్కడికి రాగానే ఇరువురు గుడ్లు విసిరారు. దీంతో వారిద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. కావాలని వాళ్లే గుడ్లు విసిరారా లేక ఇతరుల ప్రోద్బలంతో గుడ్లను విసిరారనే దానిపై విచారణ చేస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ ఇబ్రహీం, రూరల్ ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్ పాల్గొన్నారు.

అరటి ఉప ఉత్పత్తుల కేంద్రం పరిశీలన


అరటి ఉప ఉత్పత్తుల కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న రమేష్

పులివెందుల రూరల్ : పులివెందులలోని బ్రాహ్మణపల్లె రెవెన్యూ పరిధిలో నిర్మిస్తున్న అరటి ఉప ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని బుధవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ డిప్యూటీ సీఈఓ, ఏపీఎంఐపీ ఓఎస్డీ రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటి ఉప ఉత్పత్తుల కేంద్రం నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్, టెక్నికల్ ఆఫీసర్లకు సూచించారు తేనేలో మంచిన అరటి, అరటి క్యాండీ, అరటి పొడి, అరటి ప్లేట్లు, అరటి కాండం నుండి తీసిన నార తదితర ఉత్పత్తులను తయారు చేస్తామని తెలియజేశారు. అక్కడ ఏర్పాటు చేసిన అరటి కాయలను శుభ్రపరిచి, గ్రేడింగ్, ప్యాకింగ్ చేసే యంత్రాన్ని, సోలార్ డ్రయర్‌ను పరిశీలించారు. అలాగే 2022-23 ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన డ్రిప్ పరికరాలను క్షేత్రస్థాయిలో అమర్చుకున్న రైతుల పొలాలను పరిశీలించారు. అనంతరం నల్లపురెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రంలో ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి, ఏపీడీ మురళీమోహన్‌రెడ్డిలు రైతులతో డ్రిప్ పరికరాల మీద ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎంఐపీ ఓఎస్డీ రమేష్ మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లాకు 10,500హెక్టార్లలో బిందు, తుంపర సేద్య పరికరాల ఏర్పాటు కోసం ఈ ఏడాది అనుమతులు ఇచ్చామని.. ఆసక్తిగల రైతులు ఆయా ఆర్‌బీకేలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ ఈడీ, జిల్లా ఉద్యాన శాఖాధికారి మైఖేల్ రాజీవ్, హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి, ఏఓ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

న్యాయం జరిగేదెలా?

- ప్లాట్ల పేరుతో రూ.20 లక్షలకుపైనే వసూలు
- ఆదుకునేదెవరని దిక్కులు చూస్తున్న పేదలు



పేదలకు ఓబులేశు రాసిచ్చిన అగ్రిమెంటు

బి.కొత్తకోట : అతి తక్కువ ధరకు లక్షల విలువైన ప్లాట్లు వస్తాయని నమ్మి డబ్బు చెల్లించి మోసపోయిన బాధితులు తమకు న్యాయం జరిగేదెలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బి.కొత్తకోట కరెంట్‌కాలనీకి చెందిన దేరంగుల పెద్ద ఓబులేశును పోలీసులు అరెస్ట్‌చేయడంతో ప్లాట్ల మోసం జరిగిందని బాధితులు గుర్తించారు. ఓబులేశు బీరంగిరోడ్డులోని విలువైన తన సొంత భూముల్లో పేదలకు ఇళ్లస్థలాలను తక్కువ ధరకు విక్రయిస్తానని నమ్మించారు. ఒక్కొక్కరి నుంచి రూ.3 వేల నుంచి రూ.25 వరకు వసూలు చేసినట్టు పోలీసుల దర్యాప్తులో వెలుగుచూసింది. తీసుకున్న డబ్బుకు బాండుకాగితాలపై ఓబులేశు ప్లాట్ల హద్దులు వేసి రాసిచ్చాడు. ఇలా అగ్రిమెంటు చేసి ఇవ్వడంతో పేదలు నమ్మి అధికసంఖ్యలో డబ్బు చెల్లించి అగ్రిమెంట్లు చేయించుకున్నారు. ఇటీవల పేదలకు ప్లాట్లు వేసి ఇస్తానని చెప్పిన భూమి ఓబులేశుకు చెందినది కాదని తేలిపోవడం, భూ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో పోలీసుల దృష్టికి వచ్చిన మేరకు 260 మందికిపైగా పేదలకు డబ్బు చెల్లించారు. వీరినుంచి రూ.20లక్షలకు పైబడి వసూలైనట్టు భావిస్తున్నారు. బాధితులు ఇప్పుడు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ప్లాట్లు కేటాయిస్తూ చేసుకున్న అగ్రిమెంట్లు పక్కాగా ఉన్నాయి. ప్లాట్లు ఇస్తానని చెప్పిన భూమి ఓబులేశుది కాదని తేలిపోయింది. డబ్బు చెల్లించి అగ్రిమెంట్లు చేసుకొన్న వారిలో అత్యధికులు నిరుపేదలు ఉన్నారు. వీరంతా ప్లాట్ల కోసం ఆశపడి డబ్బు చెల్లించారు. ప్లాటు రాకపోగా ఈ పరిస్థితుల్లో ఇచ్చిన డబ్బు తిరిగి వస్తుందో లేదో అన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మోసగాళ్ల చిట్టా తీస్తున్నాం

ఓబులేశుకు డబ్బు చెల్లించి మోసపోయిన బాధితులు తమను ఆశ్రయిస్తే న్యాయం చేస్తామని ఎస్ఐ కే.రామమోహన్ చెప్పారు. ఓబులేశు తరహాలో ప్లాట్లు, భూ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తుల వివరాలు, సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నామని చెప్పారు.